

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 100 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 11, మార్చి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# ప్రాణం కన్నా..
# పైసా సంపాదనే మిన్న!

**ప్రాణం ఖరీదు పైస సంపాదన ముందు విలువ లేకుండా పోతుంది**




డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- లంచాలకు మరుగుతున్న ప్రభుత్వ అధికారులు
- కార్యాలయం ఏదైనా కాసులు లేనిదే సంతకాలు ఉండవు
- ఫైళ్లు మోస్తున్న సిబ్బందికి తెలియకుండా పైసలు మోస్తుంది ఎవరు
- కార్మికుల జీతాలు చెల్లించడంలో కూడా పైసల మళ్లింపు తప్పడం లేదు
- పైస సంపాదనే ప్రామాణికమై ప్రధాన లక్ష్యంగా మారిపోతుంది
- ఆస్తుల సంపాదనకు అధికార హోదాను తెగ వాడేసుకుంటున్నారు
- ప్రభుత్వం జీతాలు ఇస్తున్నప్పటికీ అధికారులు లంచాలు అడుగుతున్నారు
- పేదలు పైసలు ఇచ్చే పరిస్థితిలో లేనప్పుడు వాళ్లకు పనులు ఎలా జరగాలి
- చూడ చక్కని వ్యాపారానికి చేతులు చాపుతున్న అధికారులు

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

ప్రభుత్వంలోని ప్రధాన కార్యాలయాల్లో పైస సంపాదనకు కొదవలేకుండా పోతుందని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా హెచ్చరించారు. అధికారికం గానే బరిదెగింపుకు పాల్పడుతుండడం అవినీతి అధికారులు వాళ్లకు చెల్లుబాటు అవుతుందనే భ్రమలో తెగ ఆరాటపడుతున్నారని విమర్శలు గుప్పించారు. ఒకవైపు పేదరికం పెరిగిపోతున్న పరిస్థితుల్లో కూడా అధికార దాహం ప్రభుత్వ అధికారులను పైస సంపాదనకు మరిగేలా చేస్తుండడం ఊహించని విడ్డూరంగా ఉందన్నారు. ఒకవైపు ప్రభుత్వం లక్షల రూపాయలు ప్రభుత్వ అధికారులకు జీతాలు చెల్లిస్తున్నప్పటికిని ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్న ఫైళ్ళ నిర్వహణకు పైసలు లేనిదే సంతకాలు పెట్టకుండా నిలుపుదల చేస్తుండడం పైసా వ్యాపారానికి పెద్దపీట వేస్తున్న ట్లుగా అనిపిస్తుంది అన్నారు. అధికారిక హోదాలో రొటీన్ పద్ధతిలో జరగాల్సిన పనులు కూడా పొడగాటి కాలానికి ముడిపెడుతూ వాటితో వ్యాపారాలు చేసే స్థాయికి ప్రభుత్వ కార్యాలయాలను దిగజారుస్తుండడం హీనాతి హీనమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కార్మికులుగా పనిచేస్తున్న కష్టజీవుల జీతాల

- మిగతా 2లో..

## చర్లపల్లి-కామాఖ్య అమృత్ భారత్ రైలు

**ఈ నెల 13న ప్రారంభం**

- చర్లపల్లి - కామాఖ్య మధ్య కొత్త అమృత్ భారత్ రైలు
- మార్చి 13న కామాఖ్యలో ప్రారంభించనున్న రైల్వే శాఖ
- తెలుగు రాష్ట్రాల్లో పలు ముఖ్య స్టేషన్లలో ఆగుతుందని ప్రకటన
- తక్కువ ఖర్చుతో సురక్షితమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యం
- ఇటీవలే నాగర్‌కోయిల్ - చార్లపల్లి మధ్య మరో రైలును ప్రకటించిన రైల్వే



2

## నన్ను ఒక ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు: కవిత

- వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడ్డ తనను అరెస్ట్ చేశారన్న కవిత
- అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆగ్రహం
- ఇళ్లను కూల్చివేసిన చోటే కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్

2



## నేడు హైదరాబాద్‌కు తెలంగాణ నూతన గవర్నర్

2

## పదేళ్ల క్రితమే లొంగిపోతే ప్రాణ నష్టం తగ్గేది

- మాజీ మావోయిస్టు నేత ఆశన్న కీలక వ్యాఖ్యలు
- ప్రజల కోసమే తమ ప్రస్థానమన్న ఆశన్న
- మాజీ మావోయిస్టులు, అమరుల కుటుంబాలతో భేటీ
- అడవిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటమే లక్ష్యమని స్పష్టీకరణ
- ఆదివాసీల హక్కుల కోసం 30 ఏళ్లు పోరాడానన్న నేత



7



## లక్షల గొంతుకల పోరాటం..

- 15 ఏళ్ల కిందటి ఉద్యమ ఘట్టం: మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్న కేటీఆర్
- మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ స్పెషల్ పోస్టు
- తెలంగాణ ఉద్యమంలో అదొక కీలక ఘట్టమని వెల్లడి
- నిర్బంధాలు ఉద్యమకారుల స్ఫూర్తిని ఆపలేకపోయాయని వ్యాఖ్య
- ట్యాంక్‌బండ్‌పై లక్షల గొంతుకలు గర్జించాయని పోస్టులో పేర్కొన్న కేటీఆర్

4

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# చర్లపల్లి-కామాఖ్య అమృత్ భారత్ రైలు

**ఈ నెల 13న ప్రారంభం**
**చర్లపల్లి - కామాఖ్య మధ్య కొత్త అమృత్ భారత్ రైలు**
**మార్చి 13న కామాఖ్యలో ప్రారంభించనున్న రైల్వే శాఖ**
**తెలుగు రాష్ట్రాల్లో పలు ముఖ్య స్టేషన్లలో ఆగుతుందని ప్రకటన**
**తక్కువ ఖర్చుతో సురక్షితమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యం**
**ఇటీవలే నాగర్‌కోయిల్ - చార్లపల్లి మధ్య మరో రైలును ప్రకటించిన రైల్వే**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని చర్లపల్లి స్టేషన్ నుంచి అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కామాఖ్య వరకు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. ఈ కొత్త రైలు సర్వీసును మార్చి 13న కామాఖ్యలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ రైలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను ఈశాన్య రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉండే అసోంతో కలుపుతుంది. ఈ రైలులో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. తక్కువ ఖర్చుతో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే ఈ రైలు, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే సుదూర ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని రైల్వే శాఖ తెలిపింది. ఈ రైలు శ్రీకాకుళం రోడ్, విజయనగరం, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది. రెండు రోజుల క్రితమే తమిళనాడులోని నాగర్‌కోయిల్ నుంచి చర్లపల్లి వరకు మరో అమృత్ భారత్ రైలును రైల్వే శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లను ప్రవేశపెట్టారు. అధునాతన భద్రతా ఫీచర్లు, సెమీ ఆటోమేటిక్ కప్లర్లు, ఫైర్ డిటెక్షన్ సిస్టమ్స్ వంటి సౌకర్యాలతో వీటిని రూపొందించారు. నాన్-ఏసీ కోచ్‌లలో కూడా ప్రయాణికుల భద్రత కోసం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ఈ రైళ్ల ప్రత్యేకత.

# నన్ను ఒక ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు: కవిత

**వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడ్డ తనను అరెస్ట్ చేశారన్న కవిత**
**అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆగ్రహం**
**ఇళ్లను కూల్చివేసిన చోటే కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పేదల కోసం గళమెత్తిన తనను ఒక ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కర్కశంగా కూల్చివేసిన తీరును తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చేవి అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును గమనించాలని కవిత సూచించారు. ఈ అన్యాయంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని, పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ వేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# నేడు హైదరాబాద్‌కు తెలంగాణ నూతన గవర్నర్

**ఘన స్వాగతం పలకనున్న రేవంత్ రెడ్డి**
**తెలంగాణ నూతన గవర్నర్ గా శివప్రతాప్ శుక్లా**
**శుక్లా ఉత్తరప్రదేశ్ కు చెందిన రాజకీయవేత్త**
**గతంలో కేంద్ర మంత్రిగా కూడా పని చేసిన శుక్లా**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర నూతన గవర్నర్ శివప్రతాప్ శుక్లా నేడు భాగ్యనగరంలో అడుగుపెట్టనున్నారు. గతంలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన ఆయన, ఇప్పుడు తెలంగాణలో బాధ్యతలు చేపట్టబోతున్నారు. కాసేపట్లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న శుక్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలకనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ గవర్నర్‌గా ఉన్న జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్రకు బదిలీ కాగా, ఆయన నేడు సాయంత్రం 4.30 గంటలకు ముంబైలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా రేపు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ నియామకం రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. మార్చి 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో, తొలిరోజున ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శుక్లాకు రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన ఆయన, సీనియర్ పార్లమెంటేరియన్‌గా కూడా పేరు తెచ్చుకున్నారు.

# ప్రాణం కన్నా పైస సంపాదనే మిన్న

మొదటి పేజీ తరువాయి

చెల్లింపులలో కూడా హాజరు పట్టికల ఆధారంగా పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ఆధారంగా రికార్డులను హాజరు పట్టికలను మార్చుకుంటూ టెండర్ల రూపంలో జరిగే అవకతవకలో డబ్బులు సంపాదిస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, విద్యుత్, వైద్య, కార్మిక, శాఖలలో అధికార దుర్వినియోగం అధికారిక అవినీతిలు విపరీతంగా పెరిగిపోతున్నాయని అట్టి భారం అంతా రాష్ట్ర ప్రభుత్వంపై విపరీతంగా పడుతుందన్నారు. విద్యా శాఖలో నైతే ఇంచుమించు దేశ స్థాయి దోపిడీ జరుగుతుందని కొంతమంది అధికారులు విద్యాశాఖను కాపాడుకోవడం కోసం పరితపిస్తున్నప్పటికిని ప్రైవేటు విద్యా వ్యాపారం ప్రభుత్వాలను ఉక్కిరిబిక్కిరి చేస్తుందన్నారు. లెక్క పత్రాలు లేకుండా దోచుకోవడం కోసం ప్రభుత్వ కార్యాలయాలను వ్యాపారస్తులు పావులుగా వాడుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టెండర్ల రూపంలో కొనసాగుతున్న ప్రతి పనికి పర్సంటేజ్ ల రూపంలో డబ్బులు చెల్లిస్తే గాని అధికారులు సంతకాలు చేసే పరిస్థితిలో లేదన్నది తేట తెల్లగా కనిపిస్తుంది అన్నారు. ఏ పనికైనా ఎస్టిమేషన్ పనిమీద కొంత పర్సంటేజ్ "రీ"ఎస్టిమేషన్ పనిమీద మరికొంత పర్సంటేజ్ లాక్కోవడం దానిని అధికార అభివృద్ధి కోసం చేస్తున్న పనుల్లాగా చూపిస్తుండడం మొత్తం మీదుగా గమనించినట్లయితే అధికార హోదా పర్సంటేజ్ ల రూపంలో లంచాలకు దారితీస్తుందన్నది పక్కా నిజం అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దొంగ బిల్లులకు లెక్కలు ఉండకపోవడం బహుళ ఆశ్చర్యాలకు గురిచేస్తుందని తెలియజేస్తూ ఏ ప్రభుత్వ కార్యాలయంలో నైనా దోసుకుంటున్న సొమ్మంతటికి అధికారుల పెన్నుతో ఒకే ఒక సంతకంతో అవినీతి లెక్కలన్నీ పవిత్రమైపోతున్నాయన్నది పచ్చి నిజం అన్నారు. కూరగాయల మార్కెట్ గిరాకీ లాగా అధికారుల పెన్నులకు వాళ్ళు పెట్టే సంతకాలకు పెద్ద ఎత్తున గిరాకీ పలుకుతుందని దానిని రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం వాటిపై ఏమాత్రం శ్రద్ధ చూపించకపోవడం రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి సామ్రాజ్యాన్ని పెంచి పోషించే విధంగా కనిపిస్తుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో లంచాల హవా కొనసాగిస్తున్నది పదవీ విరమణ పొందిన అధికారులేనని వాళ్లంతా ప్రభుత్వ కార్యాలయాల్లో ఒప్పంద ఉద్యోగులుగా చలామణి అవుతూ అధికార దుర్వినియోగానికి అధికార అవినీతికి ఏ విధంగా పనిచేయాలో చాటుమాటున అధికారులకు నేర్పిస్తుండడమే కాకుండా నిజాయితీగా పనిచేసే పట్టెడంత మంది ప్రభుత్వాధికారులను కూడా పూర్తిస్థాయిలో చెడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని హెచ్చరించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అధికారుల లావాదేవీల లెక్కలేమో గాని అధికారులు సంతకాలతో జరిగించే అవినీతి వ్యాపారాలే లెక్కలేకుండా పోతున్నాయని పైగా కొన్ని కార్యాలయాల్లో నైతే ప్రభుత్వ పెద్దలకు చెల్లించాల్సి ఉంటుందంటూ దిగజారి అడుక్కునే పరిస్థితికి ప్రభుత్వ కార్యాలయాలను తయారు చేస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఎవరైనా అధికారి అవినీతికి గాని తప్పులకు గాని అక్రమాలకు గాని పాల్పడిన సందర్భాలలో ప్రభుత్వాలు గానీ ప్రభుత్వానికి చెందిన అనుబంధ సంస్థలు గాని న్యాయస్థానాలు గాని చట్టాలు గాని వాళ్లను కఠినంగా శిక్షిస్తుండడమే కాకుండా ఉద్యోగంలో నుండి తొలగిస్తూ ప్రభుత్వ కార్యాలయాలను కట్టుదిట్టమైన రక్షణలో కట్టుదిడ్డమైన భద్రతలో కాపాడుకునే వాళ్ళని గుర్తుచేస్తూ నేటి దినాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ప్రభుత్వ అధికారైతే అవినీతికి అక్రమాలకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారో వాళ్లే ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదర్శవంతులుగా హీరోలుగా తెలివిగలవారుగా వీటన్నిటికీ మించి ప్రభుత్వ నాయకులతో మంచి సత్సంబంధాలు కలిగిన వ్యక్తులుగా చలామణి అవుతుండడమే కాకుండా ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నత అధికారులతో ఉన్నతమైన సత్సంబంధాలు కలిగి ఉంటున్నారు అంటూ వాళ్ళ...వాళ్ల..ఉద్యోగ అధికార జీవిత విధానాలను ఎంతటి బలుపెక్కిన పనితనంతో ఎంతటి మదమెక్కిన పనితనంతో విర్రవీగుతున్నారంటే చెప్పడానికి వీలు లేదన్నారు. అధికారుల ఆస్తుల సంపాదనకు తిరుగులేకుండా పోతుందని చిన్న స్థాయిగా ఉద్యోగంలో చేరిన అధికారులు అధికారిక హోదా వచ్చేసరికి పేరుకు మోసిన ఆస్తులను సంపాదించుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుండడమే కాకుండా నిజాయితీని నామరూపం లేకుండా సత్యాన్ని పాతాల లోకంలో పారదోసే విధంగా జీవిస్తున్నారని ముఖ్యంగా ఏ ప్రభుత్వ కార్యాలయమైనా అదికార హోదాలో ఆదర్శవంతంగా నడుస్తుందంటే దానికి కారణం ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నత స్థాయిలో కొనసాగుతున్న కొంత మంది నిజాయితీ కలిగిన అధికారుల వల్లనేనని కితాభిచ్చారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నైతే అధికారులు రాత్రి 9 గంటల వరకు నిర్విరామం లేకుండా వ్యవస్థల భాగు కొరకు వ్యవస్థల రక్షణ కొరకు వ్యవస్థలు అభివృద్ధి కొరకు పని చేస్తున్నారంటే అది కేవలం వాల్ల గొప్పతనమేనన్నారు. మరోవైపు ప్రభుత్వ వ్యవస్థలను కాపాడాలనే ఆలోచన గాని ఉత్సాహంగాని కర్తవ్యం గాని ఎక్కువ శాతం ప్రభుత్వాధికారులలో తగ్గిపోతుందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలలో ఊహించడానికి వీలు లేనంతగా జరిగిపోతున్న అవినీతిని నియంత్రించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తే తప్ప ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ దొరకదన్నారు. ప్రజలకు ప్రభుత్వం మీద పూర్తి విశ్వాసం తగ్గడానికి ప్రధాన కారణం ప్రభుత్వ ఉన్నత అధికారులేనని వాళ్ల నిర్వహిస్తున్న విధుల్లో ఎక్కువ శాతం పేద ప్రజలను విసిగిస్తున్నారని పేద ప్రజలను పులురకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని దాని మూలంగానే సంపన్నులంతా ప్రభుత్వ కార్యాలయాలను వ్యాపారాల కోసం వాడుకుంటున్నారని దాని ప్రభావం పూర్తిగా ప్రభుత్వంపై పడుతుండడంతో ప్రభుత్వ నాయకులు ప్రజాప్రతినిధులు ఎంతటి గొప్ప పనులు చేసిన వాటి ఫలితం లేకుండా పోతుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో జరుగుతున్న కార్య నిర్వహణకు సంబంధించిన ఆధారాలను వెబ్సైట్లో కాని ఆయా ఆయా ప్రభుత్వ కార్యాలయాలు నోటీస్ బోర్డ్ లో గాని పెట్టగలిగినట్లయితే ప్రభుత్వంపై సాధారణ ప్రజలకు పూర్తి విశ్వాసం పెరుగుతుంది అనేది బలంగా నమ్మాల్సి ఉందన్నారు. ఏ ప్రభుత్వ శాఖలోనైనా అధికంగా అవినీతికి పాల్పడుతూ అధికంగా అక్రమాలకు పాల్పడుతూ అధికంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఉద్యోగులనైన అధికారులనైన శాశ్వతంగా ఉద్యోగంలో కెల్లి తొలగించే చట్టాన్ని తీసుకొస్తే తప్ప ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ లేదనేది స్పష్టంగా తేలిపోతుందన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖలలోనైతే ప్రాణం ఖరీదుకు పైస సంపాదనను అడ్డం పెడుతున్నారని అధికారుల ప్రాణాల కన్నా పైస సంపాదనకే విలువ పెరిగిపోతుందని మనిషిని పైస సంపాదిస్తుందా పైసలు మనిషి సంపాదిస్తున్నాడా ఎటు తేల్చుకోలేని పరిస్థితిలో ప్రభుత్వ ఉన్నత అధికారులు విధులు నిర్వహిస్తున్నారని ఇకనైనా వాటికి స్వస్తి పలుకుతూ నీతి నియమాలతో ఆత్మవిశ్వాసంతో ప్రభుత్వం చెల్లిస్తున్న జీతాలకు జవాబుదారీతనాన్ని వహిస్తూ ప్రజల కోసం ప్రభుత్వ కార్యాలయం రక్షణ కోసం పని చేయాలని హితవు పలికారు.

# విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి: ఎస్‌పీ ఆర్. గిరిధర్






**హన్మకొండ, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

పింగిలి గవర్నమెంట్ విమెన్'స్ కాలేజీ (ఆటోనోమౌస్)లో ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. గిరిధర్ , ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాలలో నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్.ఎస్.డి. వంటి పదార్థాలు అత్యంత ప్రమాదకరమని ఆయన తెలిపారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు చదువులు వదిలి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పష్టమైన లక్ష్యంతో చదువుకుని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏసీపీ పి. నర్సింహరావు మాట్లాడుతూ, డ్రగ్స్‌కు బానిసలైన వారు వాటి కోసం నేరాలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ కె. సోనీ విద్యార్థుల చేత మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ అక్రమ రవాణా లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే 1908 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. వెంకన్న, డి.వి. ఫణి, రంజిత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈ. కవిత, రామా రత్నమాల, డాక్టర్ వి. మమత, ఎన్‌సిసి అధికారి బి. సువర్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కన్నపేగు బంధాన్ని కాసులకు అమ్మేశారు

**వెలుగులోకి అమానవీయ ఘటన**
**మెదక్‌లో వెలుగు చూసిన దారుణ ఘటన**
**డబ్బుల కోసం వారం రోజుల బిడ్డను అమ్మేసిన తల్లిదండ్రులు**
**రూ.1.7 లక్షలకు కామారెడ్డి దంపతులకు విక్రయం**
**అంగన్‌వాడీ టీచర్ చొరవతో బయటపడ్డ దారుణం**

**మెదక్, జై భీమ్ న్యూస్**

మెదక్ జిల్లాలో అత్యంత అమానవీయ ఘటన వెలుగులోకి వచ్చింది. డబ్బుల కోసం కన్నపేగు బంధాన్ని కాసులకు అమ్ముకున్నారు ఓ దంపతులు. పుట్టిన వారం రోజులకే తమ మగబిడ్డను విక్రయించి మానవత్వానికే మచ్చ తెచ్చారు. వివరాల్లోకి వెళితే... హవేలీఘనాపూర్ మండలం లింగసానిపల్లి తండాకు చెందిన ఓ గిరిజన దంపతులకు గత నెల 10న మగబిడ్డ జన్మించాడు. అయితే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆ పసికందును వారం రోజులకే కామారెడ్డి జిల్లాకు చెందిన దంపతులకు అమ్మేశారు. ఈ దారుణం అంగన్‌వాడీ టీచర్ చొరవతో బయటపడింది. బిడ్డ పుట్టిన తర్వాత తల్లి అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు, ఇతర పోషకాహారం కోసం రాకపోవడంతో టీచర్‌కు అనుమానం వచ్చింది. ఆరా తీసేందుకు ఆమె వారి ఇంటికి వెళ్లగా, తాళం వేసి ఉండటాన్ని గమనించారు. దీంతో వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఐసీడీఎస్ అధికారులు దర్యాప్తు చేపట్టగా, ఆ గిరిజన దంపతులు మరో గ్రామంలో ఉన్నట్లు గుర్తించారు. వారిని పట్టుకుని బిడ్డ గురించి ఆరా తీయగా, అసలు నిజం ఒప్పుకున్నారు. బిడ్డను రూ. 1.7 లక్షలకు కామారెడ్డి దంపతులకు అమ్మేసినట్లు తెలిపారు. దీంతో అధికారులు వారిని హవేలీఘనాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు: మంత్రి నారా లోకేశ్

**దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్**
**కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్**
**ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి**
**వైసీపీ పేటియం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్థ మండపం రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# రవీంద్రభారతిలో “చట్టసభలలో ఓంకార్ పాత్ర” సభను జయప్రదం చేయండి

**ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎన్. రెడ్డి హంసారెడ్డి పిలుపు**

**హన్మకొండ, 09 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

ఈనెల 17వ తేదీన హైదరాబాదులోని రవీంద్ర భారతి లో నిర్వహించనున్న “చట్టసభలలో ఓంకార్ పాత్ర” అనే రాష్ట్ర స్థాయి సభను జయప్రదం చేయాలని ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎన్. రెడ్డి హంసారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు 10-03-2026న ఉదయం 11 గంటలకు హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ ఎన్. రెడ్డి హంసారెడ్డి మాట్లాడుతూ, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ శాసనసభ్యుడు, ఎంసిపిఐ(యు) వ్యవస్థాపక నేత అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాలు 2025 మే 12 నుండి 2026 మే 12 వరకు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏ శక్తులకు లొంగకుండా విలువలతో కూడిన రాజకీయాలకు ఆదర్శంగా నిలిచిన దురంధరుడని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ఓంకార్ గారు శత్రువుల హత్యాయత్నాలకు తలొగ్గని మృత్యుంజయుడిగా నిలిచారని పేర్కొన్నారు. నర్సంపేట శాసనసభ నియోజకవర్గం ప్రజలు 1972 నుండి 1994 వరకు ఐదు సార్లు అత్యధిక మెజార్టీతో శాసనసభ్యునిగా గెలిపించి గౌరవించారని గుర్తుచేశారు. రాష్ట్ర శాసనసభలో ప్రజా సమస్యలపై ధైర్యంగా స్వరం వినిపిస్తూ భూ సమస్యలు, విద్యా-వైద్య విధానాలు, ఉద్యోగ కల్పన, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, నీళ్లు-నిధుల పంపకాల వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు చేసినందుకు ప్రజలు ఆయన్ను “అసెంబ్లీ టైగర్”గా అభివర్ణించారని తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లను వ్యతిరేకిస్తూ “నక్సలిజం -- ప్రభుత్వ వైఖరి” అంశంపై శాసనసభలో రెండున్నర గంటల పాటు ఏకధాటిగా ప్రసంగించి, శాంతిభద్రతల విషయంలో భార్గవ కమిషన్ (ఏకసభ్య కమిషన్) నియామకంలో కీలక పాత్ర పోషించారని వెల్లడించారు. ఓంకార్ ఆదర్శ జీవితాన్ని స్మరించుకుంటూ, 2026 మార్చి 17న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర



స్థాయి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు రాష్ట్ర మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు మరియు వామపక్ష పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని చెప్పారు. కావున ఈ సభను విజయవంతం చేయడానికి ప్రజాతంత్రవాదులు, వివిధ రాజకీయ పార్టీలు, కవులు, కళాకారులు, మేధావులు, మహిళలు, యువజనులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, కర్ర రాజిరెడ్డి, మాస్ సావిత్రి; జిల్లా కమిటీ సభ్యులు చీపురు ఓదయ్య, కూతురు ఇంద్రారెడ్డి, మొగిలి శ్రీనివాసరావు; పార్టీ సభ్యులు పరిమళ, గోవర్ధన్ రాజు, అన్నబోయిన ప్రేమలత, మట్టెడ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మగడ్డ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ



**పెద్దమ్మ గడ్డ / జై భీమ్ న్యూస్ :**

హనుమకొండ లోని పెద్దమ్మగడ్డ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ 9వ డివిజన్ ప్రెసిడెంట్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు భీమ వినయ్ హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు విద్యార్థులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి మంచి సేవ చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ప్రోత్సాహం ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఫేర్‌వెల్ కార్యక్రమంలో అందరూ కలిసి భోజనం చేసి ఆనందంగా గడిపారు. పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ఆనందకర వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## “దూరదృష్టి, బాధ్యతాయుత సమగ్ర ఆలోచనలతోనే స్థిరమైన అభివృద్ధి” - ఆచార్య శైలజ కుమారి

**హన్మకొండ, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

“దూరదృష్టి, బాధ్యతాయుతమైన సమగ్ర ఆలోచనలతోనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది” అని నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ వరంగల్ ఆచార్యులు ఆచార్య శైలజ కుమారి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబిలీ ఉత్సవాల సందర్భంగా మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ బి. దీపా జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. “లీటరేచర్, లీడర్షిప్ అండ్ ఇన్నోవాషన్ : షాపింగ్ వికసిత్ భారత్ -- 2047” అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ, నిజమైన నాయకత్వం ధైర్యమైన నిర్ణయాలతో కూడి ఉండాలని తెలిపారు. వ్యవస్థలను గౌరవిస్తూ ముందుకు సాగడం నాయకత్వానికి ముఖ్య లక్షణమని పేర్కొన్నారు. అనిశ్చిత పరిస్థితులకు ముందుగానే సిద్ధంగా ఉండాలని, ఒకే ప్రణాళికపై ఆధారపడకుండా ‘ప్లాన్--బి’, ‘ప్లాన్--జ’లను సిద్ధంగా ఉంచుకోవడం అవసరమని సూచించారు. ఈ సందర్భంగా ఆమె కిరణ్ బేడి, ఇంద్ర నూయి, ఇందిరా గాంధీ, మదర్ తెరిస్సా, లత మంగేష్కర్ వంటి ప్రముఖ మహిళా నాయకుల సేవలను ఉదాహరణగా ప్రస్తావించారు. సమాజ నిర్మాణంలో మహిళల నాయకత్వం ఎంత ముఖ్యమో వివరించారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళల భాగస్వామ్యం అత్యంత అవసరమని అన్నారు. వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. జ్యోతి దేశ అభివృద్ధి, మానవ విలువల పెంపు, నాయకత్వ వికాసం మహిళల ద్వారా మరింత బలపడుతుందని తెలిపారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జే. కృష్ణవేణి మాట్లాడుతూ భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచవ్యాప్తంగా పెంచడంలో మహిళలు ముందువరుసలో ఉన్నారని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో పేర్కొన్న నాలుగు ముఖ్య స్థంభాలలో మహిళల పాత్ర కూడా కీలకమని అన్నారు. ఆచార్య ఎం. స్వర్ణలత మహిళలు సామాజిక రంగాల్లో మరింత చురుకుగా పాల్గొనాలని, 2047 నాటికి భారతదేశ ముఖచిత్రం గణనీయంగా మారుతుందని తెలిపారు. ఆచార్య సి.జే. శ్రీలత “నేటి మహిళే రేపటి నాయకురాలు” అని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మమత అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడితో ఆగ్రహం: కరీంనగర్

**హన్మకొండ రహదారిపై మహిళల రాస్తా రోకో**



**హసన్‌పర్తి, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి ప్రాంతంలో కొనసాగుతున్న తాగునీటి ఎద్దడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళలు పెద్ద ఎత్తున రోడ్డెక్కారు. కరీంనగర్--హన్మకొండ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టి రాస్తా రోకో నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారిపై వాహన రాకపోకలు కొంతసేపు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. తమ కాలనీల్లో అనేక రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, నీటి కోసం బావులు, ట్యాంకర్లు ఆశ్రయించాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఆందోళన అనంతరం మహిళలు హసన్‌పర్తి కార్పొరేషన్ కార్యాలయం ముందు బైటాయించి నిరసన కొనసాగించారు. సమాచారం అందుకున్న హసన్‌పర్తి ఎస్సై దేవేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ సిబ్బందికి వెంటనే నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించి, తాగునీటి పంపిణీ పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అవసరమైతే అదనపు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. స్థానికులు మాత్రం తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. నీటి సమస్య పునరావృతం కాకుండా సరైన ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పింగిళి కళాశాలలో ఘనంగా సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి



**హన్మకొండ, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

వడ్డేపల్లిలోని పింగిళి కళాశాలలో మహనీయ సామాజిక సంస్కర్త సావిత్రిబాయ్ పూలే 129వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమం ప్రారంభంలో సావిత్రిబాయ్ పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు, త్యాగాలు మరియు దూరదృష్టి భారత సమాజ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. 19వ శతాబ్దంలో మహిళలకు విద్య అందించాలనే సంకల్పంతో అనేక సామాజిక అడ్డంకులను ఎదుర్కొంటూ విద్యా ఉద్యమాన్ని ప్రారంభించిన మహనీయురాలిగా ఆమె నిలిచారని తెలిపారు. సమాజంలో సమానత్వ భావన పెంపొందించడంలో సావిత్రిబాయి పూలే పాత్ర విశేషమని, ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆమె ఆలోచనలను అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల చరిత్ర విభాగాధిపతి డా. కొలిపాక శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని మాట్లాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, సామాజిక సేవకురాలిగా సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఉన్నత భావాలు కలిగిన మహాత్మా జ్యోతిరావు పూలే గారి సహధర్మచారిణిగా ఆమె జీవితం భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు, కిట్స్ కళాశాల డా. రమేష్, డా. కళ్యాణ్, తెలుగు విభాగాధిపతి ఎస్. మధు, అధ్యాపకులు డా. సామ్యేల్ ప్రవీణ్ కుమార్, ప్రొ. ప్రశాంతి, డా. లక్ష్మీకాంతం, రత్నమాల, సునీత, రాజేశ్వరి, డా. బాలరాజు, శ్రీలత, రామకృష్ణారెడ్డి, జ్యోతి, రాంరెడ్డి, రమేష్ కుమార్, జ్యోతిర్మయి, కల్పన, నరేష్ తదితరులు పాల్గొన్నారు. భోధన, భోధనేతర సిబ్బంది, కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై సావిత్రిబాయి పూలేకు ఘనంగా నివాళులు అర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో సిటీ గార్డ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి మృతి

**వరంగల్, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ కమిషనరేట్ సిటీ ఆర్మూర్ విభాగంలో సిటీ గార్డ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. మధ్యాహ్నం సమయంలో కాజీపేట ప్రాంతంలోని ఫాతిమా జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే వెంకట్ రెడ్డిని సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ కొద్దిసేపటి క్రితం ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, సహచర సిబ్బంది తీవ్ర విషాదంలో మునిగిపోయారు. వెంకట్ రెడ్డి మరణంపై పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన సిబ్బందిని కోల్పోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా విశ్వవిద్యాలయంలో అవగాహన కార్యక్రమాలు



**హన్మకొండ, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 10 రోజుల “ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా మంగళవారం (మార్చి 10) కాకతీయ యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కాలేజీ, ఇంగ్లీష్ విభాగం మరియు ఇతర విభాగాలకు చెందిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా “క్లీన్ అండ్ గ్రీన్” కార్యక్రమాన్ని చేపట్టి విభాగ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించి, వాటి పనితీరు, నిర్వహణ స్థితిని సమీక్షించారు. పరికరాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇదే కార్యక్రమంలో భాగంగా సి.ఎస్.సి సి.ఎస్.డి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సీ.ఎస్.ఈ, ఐటీ ల్యాబ్‌లలో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు సమూహాలుగా పాల్గొని ల్యాబ్ పరిసరాలను పరిశుభ్రంగా మార్చడంలో చురుకైన పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతాభావాన్ని పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల చొరవను కళాశాల అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమం విజయవంతంగా సాగి, విశ్వవిద్యాలయంలో పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని నెలకొల్పడంలో విద్యార్థులు తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో భారీ ఊరట

**ప్రభాకర్ రావుకు అరెస్ట్ నుంచి మినహాయింపునిచ్చిన సుప్రీంకోర్టు**

**సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేయవద్దని షరతు**

**కోర్టు అనుమతి లేకుండా రాష్ట్రం, దేశం విడిచి వెళ్లకూడదని కండిషన్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ప్రభాకర్ రావుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ఆయనకు అరెస్ట్ నుంచి మినహాయింపు ఇస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ వెసులుబాటుతో పాటు కోర్టు కొన్ని కఠినమైన షరతులను కూడా విధించింది. సిట్ విచారణకు ప్రభాకర్ రావు పూర్తిస్థాయిలో సహకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసులోని సాక్ష్యాలను గానీ, ఆధారాలను గానీ తారుమారు చేసే ప్రయత్నం చేస్తే బెయిల్ వెంటనే రద్దవుతుందని హెచ్చరించింది. కోర్టు అనుమతి లేకుండా రాష్ట్రం, దేశం విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలతో రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన తర్వాత కేసు నమోదయింది. అప్పట్లో ఇంటెలిజెన్స్ ఐజీగా ఉన్న ప్రభాకర్ రావు పర్యవేక్షణలోనే ఈ ప్రక్రియ సాగిందని సిట్ తన దర్యాప్తులో గుర్తించింది. ఇప్పటికే ఈ కేసులో ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు వంటి ఉన్నతాధికారులు అరెస్టయి విచారణ ఎదుర్కొంటున్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస

**చొక్కాలు పట్టుకున్న కౌన్సిలర్లు**
**కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, బాహాబాహీ**
**నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ డిమాండ్**
**కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట**
**చైర్‌పర్సన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ**

**ఆదిలాబాద్, జై భీమ్ న్యూస్**

ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పార్టీల కౌన్సిలర్లు పరస్పరం చొక్కాలు పట్టుకుని, బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల గందరగోళం మధ్యనే చైర్‌పర్సన్ అనూష 'అజెండా పాస్' అంటూ ప్రకటన చేసి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. అయితే చర్చ లేకుండానే అజెండాను ఎలా పాస్ చేస్తారని బీజేపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. చైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బయటకు రాకుండా బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. పోలీసులు జోక్యంతో చైర్‌పర్సన్ బయటకు వచ్చారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా, నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్ అజయ్, బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మధ్య తోపులాట చోటు చేసుకుంది. పాలకవర్గం సభను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

# నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి?: బండి సంజయ్

**రంగనాయక్ సాగర్ పనులను వెంటనే పూర్తి చేయాలని**
**బండి సంజయ్ డిమాండ్**
**పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శ**
**పనులు పూర్తయి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని వ్యాఖ్య**



**రాజన్న సిరిసిల్ల, జై భీమ్ న్యూస్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగునీటి కాలువ పనుల కోసం ఆందోళన బాట పట్టిన రైతులను పోలీసులు అరెస్టు చేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. తమ పొలాలకు నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలాలకు సాగునీరు అందించే 11వ ప్యాకేజీ (ఎల్‌ఎం 4, ఎల్‌ఎం 6) కాలువ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాలువ పనుల కోసం రూ. 3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా, ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై బండి సంజయ్ విస్మయం వ్యక్తం చేశారు. ఈ పనులు గనుక పూర్తయి ఉంటే దాదాపు 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉండి కూడా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ ఒక 'రైతు ద్రోహి' అని ఆయన ఘాటుగా విమర్శించారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వైఫల్యాల వల్లే రైతులు పంటలు నష్టపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా నిలిచిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. రైతులపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఊరుకునేది లేదని, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని హెచ్చరించారు. రైతుల డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీ అండగా ఉంటుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కాలువ పనులు ప్రారంభించకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# లక్షల గొంతుకల పోరాటం..

**15 ఏళ్ల కిందటి ఉద్యమ ఘట్టం: మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్న కేటీఆర్**
**మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ స్పెషల్ పోస్టు**
**తెలంగాణ ఉద్యమంలో అదొక కీలక ఘట్టమని వెల్లడి**
**నిర్బంధాలు ఉద్యమకారుల స్ఫూర్తిని ఆపలేకపోయాయని వ్యాఖ్య**
**ట్యాంక్‌బండ్‌పై లక్షల గొంతుకలు గర్జించాయని పోస్టులో పేర్కొన్న కేటీఆర్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్'కు నేటితో 15 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసేలా చేసిన అద్భుత పోరాట రూపాల్లో ఇదొకటని ఆయన పేర్కొన్నారు. ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 2011 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్నారు. "స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లు. నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయి" అని కేటీఆర్ తన పోస్టులో రాసుకొచ్చారు. స్వరాష్ట్రం కోసం లక్షల గొంతుకలు ట్యాంక్‌బండ్‌పై ఏకమై నినదించిన అద్భుత పోరాటానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ తన పోస్టుకు ఆనాటి మిలియన్ మార్చ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను జతచేశారు. "తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ విజయవంతం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**హనుమకొండ/భీమదేవరపల్లి, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామ రైతు వేదికలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి, ఈ కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయాలని, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. భీమదేవరపల్లి మండలానికి జనగాం మెడికల్ కాలేజీని దత్తతగా ఇచ్చినట్లు వెల్లడించి, గ్రామాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్, రవాణా శాఖలు కలిసి "అరైవ్ అలైవ్ -- సురక్షిత ప్రయాణం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని పేర్కొన్నారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లను కోరారు. సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన సన్నబియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల లబ్ధి అందని అర్హుల జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయం, ఆయిల్‌పామ్, హార్టికల్చర్ రంగాల్లో శాస్త్రవేత్తల సలహాల మేరకు పంటల మార్పిడి పద్ధతులను రైతులకు ప్రోత్సహించాలని చెప్పారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, డ్రాప్‌ఔట్ విద్యార్థులను గుర్తించి బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించి, పూర్తి అయిన ఇళ్లకు గృహప్రవేశాలు త్వరగా నిర్వహించాలని, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, మహిళా సంఘాలకు పంపిణీ చేసిన స్టీల్ బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, 18 ఏళ్లు పూర్తయిన వారికి డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు హెల్మెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. 2025 మార్చి వరకు పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు నిలిపి వేయకుండా చెల్లింపులు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలకు శాశ్వత పరిష్కారాలు చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, రాజకీయాలు వేరు -- అభివృద్ధి వేరని స్పష్టం చేస్తూ ప్రజల అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డిఆర్డీఓ మేన శ్రీను, జెడ్పీ సీఈవో రవి, డీఎంఅండ్‌హెచ్ఓ అప్పయ్య, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, తహసీల్దార్ రాజేష్, ఎంపిడిఓలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు సులభంగా ప్రజల వద్దకు చేరాలి.

**ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై మార్చి 12న తేదీన ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం.**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.**




**ములుగు, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు మరింత సులభంగా చేరాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై మార్చి 12వ తేదీన ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు హైదరాబాద్ నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా జరుగుతున్న పారిశుధ్య పనులు, ఫైల్ క్లియరెన్స్, మార్చి12న సర్పంచ్, కౌన్సిలర్ లకు ఏర్పాటు చేయనున్న శిక్షణ కార్యక్రమంపై సుదీర్ఘంగా చర్చించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధుల పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వం నిర్వహిస్తున్న మొదటి కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో వారి భాగస్వామ్యం కీలకంగా ఉంటుందని శిక్షణ కార్యక్రమంలో కార్యచరణ ఉద్దేశం ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ప్రాధాన్యత పది థీమ్స్ ప్రధాన అంశాలపై ప్రజా ప్రతినిధులు వారి పాత్రను స్పష్టంగా వివరిస్తూ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్లు సి.హెచ్.మహేందర్ జి, సంపత్ రావు లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ గది నుంచి ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ, ఫైల్స్ క్లియరెన్స్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. క్షేత్ర స్థాయి సందర్శనలో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ల భాగస్వామ్యం, పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో ఉండటం గమనించినట్లు కలెక్టర్ తెలిపారు. మార్చి 12వ తేదీన స్థానిక ప్రజా ప్రతినిధులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రతి ప్రజా ప్రతినిధికి ఆహ్వానం అందేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వివిఐపి, వి.ఐ.పి. లకు ఆహ్వానం అందేలా జాగ్రత్తలు పాటించినట్లు అన్నారు. శిక్షణ కార్యక్రమానికి వచ్చే ప్రజా ప్రతినిధులకు అవసరమైన ఆహారం, ఇతర ఏర్పాట్లు కూడా కల్పించామని, ఆడియో, వీడియో వ్యవస్థ సరిగ్గా ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఉదయం సెషన్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ, 10 థీమ్స్ లో వివిధ శాఖల ద్వారా చేపట్టే పనులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంపై అవగాహన కల్పిస్తామని, లంచ్ అనంతరం పిఆర్ చట్టం, మున్సిపల్ చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ వీడియో సమావేశంలో డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డి డబ్ల్యు ఓ ప్రేమలత, డిఇఓ సిద్ధార్థ రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే రోజులో రెండు కిడ్నీ మార్పిడి

**ఇద్దరు రోగులకు ప్రాణదానం**
**మెడికవర్ హాస్పిటల్ వైద్యులు విజయం**



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరంలోని వైట్ ఫీల్డ్ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు మూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్న ఇద్దరు రోగులకు కొత్త జీవితాన్ని ఇచ్చారు, ఇతర ఆసుపత్రులు వాటిని "మార్జినల్ కిడ్నీలు"గా పరిగణించి ఉపయోగించడానికి ఇష్టపడని మూత్రపిండాలను ఉపయోగించారు. ఫిబ్రవరి 27న జరిగిన ఈ శస్త్రచికిత్సలో, ఇద్దరు రోగులను ఒకే రోజు విజయవంతంగా మార్పిడి చేశారు. శవదానం ద్వారా పొందిన రెండు మూత్రపిండాలను ఉపయోగించడానికి ఇతర ఆసుపత్రులు నిరాకరించాయి. కానీ మెడికవర్ హాస్పిటల్‌లోని సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ హరీష బాబు, తన వైద్య అనుభవం మరియు బలమైన నమ్మకంతో, ఆ మూత్రపిండాలను అంగీకరించి, అవసరమైన క్రాస్-మ్యాచింగ్ పరీక్షలు నిర్వహించి, రోగులపై ఉపయోగించాలని నిర్ణయించుకున్నారు. ఈ ముఖ్యమైన శస్త్రచికిత్సను కన్సల్టెంట్ యూరాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ దిలీప్ నిర్వహించారు మరియు కన్సల్టెంట్ యూరాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ ప్రమోద్ నేతృత్వంలోని బృందం విజయవంతంగా శస్త్రచికిత్సను నిర్వహించింది. ఇద్దరు సర్జన్లు ఒకేసారి శస్త్రచికిత్స చేసి, ఇద్దరు రోగుల ప్రాణాలను కాపాడగలిగారు. మొదటి రోగి వయస్సు 62 సంవత్సరాలు. ఆయనకు రక్తపోటు కారణంగా మూత్రపిండాలు దెబ్బతిన్నాయి మరియు గత రెండు సంవత్సరాలుగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆయనకు మూత్రపిండ మార్పిడి జరిగింది మరియు ఇప్పుడు ఆయన మూత్రపిండాలు సరిగ్గా పనిచేస్తున్నాయి. రోగి పూర్తిగా కోలుకుని ఇంటికి వెళ్ళాడు. మరో రోగి వయస్సు 41 సంవత్సరాలు. ఆయన గత ఆరు సంవత్సరాలుగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. విజయవంతమైన మూత్రపిండ మార్పిడి తర్వాత ఆయన కూడా బాగా కోలుకున్నారు. సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ హరీష బాబు మాట్లాడుతూ, "సాధారణంగా, చాలా ఆసుపత్రులు మార్జినల్ మూత్రపిండాలను ఉపయోగించడానికి వెనుకాడతాయి. కానీ సరైన వైద్య మూల్యాంకనం మరియు అనుభవంతో, వారు చాలా మంది ప్రాణాలను కాపాడగలరు. వృధా అయ్యే మూత్రపిండాలను ఉపయోగిస్తున్న ఇద్దరు రోగులకు మేము కొత్త జీవితాన్ని ఇవ్వగలిగినందుకు మేము సంతోషంగా ఉన్నాము." అని అన్నారు. కన్సల్టెంట్ యూరాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ దిలీప్ మాట్లాడుతూ, "ఈ శస్త్రచికిత్స వైద్యపరంగా సవాలుతో కూడుకున్నది. కానీ బృందం యొక్క సమన్వయం మరియు సరైన ప్రణాళికతో, రెండు మార్పిడిలు విజయవంతమయ్యాయి. ఇద్దరు రోగులు ఇప్పుడు బాగా కోలుకుంటున్నారు."అని తెలిపారు. కన్సల్టెంట్ యూరాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ, "ప్రతి అవయవ దానం విలువైనదే. కొన్నిసార్లు, ఉపయోగించలేనిదిగా అనిపించే అవయవం కూడా సరైన వైద్య నిర్ణయాలతో ప్రాణాలను కాపాడుతుంది. ఈ విజయం అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తుంది."అని చెప్పారు.

# ఇప్ప సారా... మరోసారి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పపువ్వుతో చేసే సారా ఆర్గానిక్ అని, ఇది ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపదని అన్నారు. అసెంబ్లీలో దీనిని ప్రస్తావిస్తే ప్రతిపక్షాలు కూడా స్వాగతిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మాత్రం చివరకు ఏది సరైనదో అదే చేస్తుందని అన్నారు. ఇప్పపువ్వు అడవిలో సహజంగా లభిస్తుందని ఆయన తెలిపారు. దీనితో మనం ప్రపంచ మార్కెట్‌లో కూడా పోటీ పడవచ్చని అన్నారు. మెక్సికో టకీలా డ్రింక్, ఫ్రాన్స్ కొనియా డ్రింక్‌ను తయారు చేసి ఎగుమతి చేస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే తాను ఇప్పసారాపై పూర్తి నివేదిక సిద్ధం చేసుకున్నానని అన్నారు. ఇప్పసారా వల్ల కలిగే లాభ నష్టాల గురించి అసెంబ్లీలో మాట్లాడతానని తెలిపారు. గతంలో ఇప్పసారా తాగిన వారు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా 110 ఏళ్లు బతికారని అన్నారు. కానీ ఇప్పుడు మద్యం తాగి అరవై ఏళ్లు కూడా ఆరోగ్యంగా బతకడం లేదని అన్నారు. ఇప్పపువ్వు సారాను మార్కెట్ చేస్తే ఆదివాసీలు, ఎస్టీలకు జీవనోపాధి దొరుకుతుందని అన్నారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి కూడా మంచి ఆదాయం లభిస్తుందని అన్నారు.

# మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు విస్తృత

**డ్రగ్స్ రహిత సమాజానికి పోలీసుల పిలుపు**





**హసన్‌పర్తి, 10 మార్చి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

యువతలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు హసన్‌పర్తి మండలంలోని వంగపహాడ్, మల్లారెడ్డిపల్లి, నాగారం గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించారు. స్థానిక సీఐ చేరాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఖాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ తెలంగాణ టీమ్ ఏసీపీ నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గుడుంబా, బెల్లం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిగతులను కూడా దెబ్బతీస్తోందని తెలిపారు. చిన్న వయసులోనే మత్తు అలవాట్లకు బానిసైతే భవిష్యత్తు చీకటిలోకి నెట్టబడుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ అనే మహమ్మారి యువత భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తేనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని చెప్పారు. విద్యార్థులే రేపటి నాయకులు, శాస్త్రవేత్తలు, అధికారులు కావాలని ఆకాంక్షించారు.

ఖాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... యువత మాదక ద్రవ్యాలకు బానిసైతే వారి కుటుంబాలు మాత్రమే కాకుండా సమాజం కూడా నష్టపోతుందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు, మానసిక ఆందోళనలు, నేరప్రవర్తన పెరిగే ప్రమాదం ఉందని వివరించారు. సోషల్ మీడియా లేదా స్నేహితుల ప్రలోభాలకు లోనవకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరికైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈగల్ ఫోర్స్ తెలంగాణ టీమ్ ఏసీపీ నర్సింగరావు మాట్లాడుతూ... డ్రగ్స్ నిర్మూలనలో ఈగల్ ఫోర్స్ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠ్యేతర కార్యకలాపాలలో పాల్గొనాలని సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనలో యువతే ప్రధాన పాత్ర పోషించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అత్యవసరమని పేర్కొన్నారు. అనంతరం వంగపహాడ్ గ్రామ ప్రధాన కూడలిలో విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి", "ఆరోగ్యవంతమైన యువతే దేశ భవిష్యత్తు" వంటి నినాదాలతో విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులను స్థానిక ప్రజలు సన్మానించి అభినందించారు. ఈ అవగాహన సదస్సులో హసన్‌పర్తి సీఐ చేరాలు, ఎస్సై రవి, దేవేందర్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు పునరుద్ఘాటించారు.

# "విద్య ద్వారానే మహిళల అభ్యున్నతి సాధ్యం"

**కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**





**హన్మకొండ, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

"విద్య ద్వారానే మహిళల అభ్యున్నతి సాధ్యం" అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బి. సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన "సావిత్రిబాయి ఫులే 129వ వర్ధంతి" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దూర విద్య ప్రాంగణంలోని సావిత్రిబాయ్ ఫూలే, జ్యోతిరావు ఫూలే దంపతుల విగ్రహాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ సావిత్రిబాయి ఫులే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉద్యోగులతో ముచ్చటిస్తూ మాట్లాడుతూ నేటి మహిళా విద్యకు సావిత్రిబాయి ఫులే చేసిన సేవలు అమూల్యమని పేర్కొన్నారు. ఆమె కృషి ఫలితంగానే మహిళా విద్యకు బాటలు పడినట్లు తెలిపారు. భారతదేశంలో సగభాగమైన మహిళలు విద్యావంతులు అయినప్పుడు దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, అసమానతలు, వివక్షలను ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యాన్ని విడిచిపెట్టని మహనీయురాలు సావిత్రిబాయి ఫులే అని కొనియాడారు. నేటి యువత ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ బి. రమ, డాక్టర్ ఎన్. సుదర్శన్‌తో పాటు పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయంలో ఆధ్యాత్మిక వైభవం

**దత్తగురు రాఘవేంద్ర మహారాజ్ సమక్షంలో అఘోరాలు, ? నాగసాధువుల ప్రత్యేక దర్శనం**





**ములుగు, రామప్ప, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం రామప్ప దేవాలయంను శ్రీ శ్రీ శ్రీ దత్త గురు రాఘవేంద్ర గిరి మహారాజ్‌తో పాటు అఘోర స్వాములు, నాగసాధువులు, విదేశీయ భక్తులు సందర్శించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శివలింగానికి అభిషేకాలు సమర్పించారు. ఆలయ వేదపండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దత్త గురు రాఘవేంద్ర గిరి మహారాజ్ మాట్లాడుతూ, రామప్ప దేవాలయం కేవలం చారిత్రక కట్టడం మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక శక్తి క్షేత్రమని పేర్కొన్నారు. కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ దేవాలయం ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు సంపాదించడం తెలంగాణకు గర్వకారణమని తెలిపారు. ఇలాంటి పవిత్ర క్షేత్రాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నాగసాధువులు దేవాలయ నిర్మాణ శైలి, శిల్పకళలను ఆసక్తిగా పరిశీలించి, ఆలయ ప్రాంగణంలో భజనలు నిర్వహించారు. అఘోర స్వాములు శివనామ స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. విదేశీయులు కూడా ఆలయ వైభవాన్ని చూసి ఆకర్షితులయ్యారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆశీర్వాదాలు పొందారు. అనంతరం నాగసాధువులు, అఘోర స్వాములు ఆలయ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా కలియ తిరిగి "ఓం నమః శివాయ" నినాదాలతో మారుమోగేలా చేశారు. భక్తుల్లో ఆధ్యాత్మికోత్సాహం నింపుతూ, కనులపండుగగా దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రాకపోకలను నియంత్రిస్తూ భద్రతా చర్యలను సమర్థంగా అమలు చేశారు. ఈ కార్యక్రమంలో దత్తగురు రాఘవేంద్ర మహారాజ్ శిష్యులు ఉమా విద్యాసాగర్, సుకన్య అనిల్ కాందారి, అంకేశ్వరపు రాంచందర్ రావు, తంగేళ్లపల్లి శ్రీదేవి సాంబమూర్తి, కొరివి అరుణ, కూనమళ్ళ అనిత తదితరులు పాల్గొన్నారు. మొత్తం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో విజయవంతంగా కొనసాగింది.

# "బెల్ట్ షాపులు - గుడుంబా దందా ఫలితం ఇదేనా?

**మద్యం మత్తులో రోడ్డుపై నిద్రపోతున్న వార్డ్ మెంబర్ దౌలత్ నగర్ ఘటనతో గ్రామాల్లో మద్యం సమస్యపై ఆందోళన అధికారుల జోక్యం కోరుతున్న గ్రామస్థులు..మద్యపాన రహిత గ్రామంగా ప్రకటించాలని డిమాండ్**

**జై భీమ్ న్యూస్ /పర్వతగిరి**



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామంలో చోటుచేసుకున్న ఒక ఘటన గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న అక్రమ మద్యం సమస్యపై మరోసారి చర్చకు దారి తీసింది. గ్రామానికి చెందిన నాలుగో వార్డు సభ్యుడు మద్యం మత్తులో ఆర్ ఉ బి రోడ్డుపై పడిపోవడం స్థానికంగా కలకలం రేపింది. రోడ్డుపై పడివున్న అతడిని గమనించిన గ్రామస్థులు పక్కకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సంఘటనతో గ్రామాల్లో మద్యం వినియోగం పెరుగుతున్న పరిస్థితిపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం ముఖ్యంగా దౌలత్ నగర్ గ్రామంలోని బెల్ట్ షాపులు పరిసర ప్రాంతాల్లోని చెరువు కొమ్ము తండా, ఇస్లావత్ తండా, టూక్య తండా, ఏబి తండా ప్రాంతాల్లో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పెరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా గుడుంబా తయారీ మరియు విక్రయాలు కూడా కొనసాగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు కొనసాగుతున్న పరిస్థితిపై ప్రజలు పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖల చర్యలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అక్రమ మద్యం దందా ఎలా కొనసాగుతోంది? గుడుంబా తయారీని అరికట్టేందుకు చర్యలు ఎందుకు కనిపించడం లేదు? బెల్ట్ షాపులపై ప్రతి రోజు తనిఖీలు జరుగుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.గ్రామాల్లో పెరుగుతున్న మద్యం వ్యసనం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మహిళలు, గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువత మరియు కార్మిక వర్గం మద్యం బారిన పడుతున్న పరిస్థితి గ్రామ సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని వారు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో జరుగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టి, బెల్ట్ షాపులు మరియు గుడుంబా తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే దౌలత్ నగర్ గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా అధికారికంగా ప్రకటించి కఠిన చర్యలు అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాల్లో శాంతి, కుటుంబాల సంక్షేమం దృష్ట్యా అక్రమ మద్యం దందాను పూర్తిగా అరికట్టాలని ప్రజలు, స్థానిక యూత్ అసోసియేషన్, మహిళా సంఘాల ముఖ్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**హన్మకొండ, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**




హనుమకొండ జిల్లాలోని స్పోర్ట్స్ పాఠశాలలో నాలుగవ తరగతి ప్రవేశాల కోసం ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి శ్రీ ఏ. శ్రీనివాస్ తెలిపారు. ఫిబ్రవరి 26వ తేదీ నుండి మార్చి 12వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు అధికారిక వెబ్‌సైట్ https://tgss.telangana.gov.inను సందర్శించి దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ ప్రవేశాలకు 01-09-2017 నుండి 31-08-2018 మధ్య జన్మించిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ తేదీలకు ముందు లేదా తరువాత జన్మించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులవుతారని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు మార్చి 13 నుండి 17 వరకు మండల స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించబడతాయి. అనంతరం మార్చి 28 నుండి ఏప్రిల్ 1 వరకు జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించి తుది ఎంపికైన విద్యార్థులకు స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి, ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియలో సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో కోరారు.

# హెచ్‌ఎం గైర్హాజరుతో స్కూల్‌కు తాళం: పదో తరగతి భవిష్యత్తుపై విద్యార్థుల ఆందోళన

**రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**






విట్యాల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి గైర్హాజరు వివాదంగా మారి, విద్యార్థుల ఆందోళనకు దారితీసింది. విట్యాల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విధులకు నిరంతరం హాజరుకావడంలేదని ఆరోపిస్తూ విద్యార్థులు పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఇంటికి వెళ్లి తమ ఆవేదనను వెల్లడించారు. విద్యార్థుల వివరాల ప్రకారం, హెడ్‌మాస్టర్ గణతంత్ర దినోత్సవం (జనవరి 26) సందర్భంగా జెండా ఎగురవేసేందుకు వచ్చిన తర్వాత పాఠశాలకు రావడం లేదని తెలిపారు. ఆయనే ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా 8, 9, 10 తరగతులకు బోధించాల్సి ఉండగా, తరగతులు సక్రమంగా సాగడంలేదని వాపోయారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు త్వరలో జరగనున్న ఎస్సెస్సీ వార్షిక పరీక్షల నేపథ్యంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిలబస్ పూర్తి కాలేదని, ఇంగ్లీష్ బోధన లేక చదువులు దెబ్బతింటున్నాయని చెప్పారు. "ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయితే మా భవిష్యత్తు చీకటిలో పడుతుంది. మా చదువులతో ఎందుకు ఆడుకుంటున్నారు?" అంటూ విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. "మీకు ఇతర పనులు ఉంటే మా సార్‌ను అక్కడే ఉంచుకోండి, మాకు పాఠాలు చెప్పేందుకు మరో టీచర్‌ను పంపండి" అని అధికారులను కోరారు. విద్యార్థుల నిరసనతో విషయం గ్రామ సర్పంచ్ దృష్టికి వెళ్లగా, ఆయన సంబంధిత మండల విద్యా అధికారిని (ఎంఈఓ) సంప్రదించారు. "ప్రిన్సిపాల్ గారికి వేరే పని ఉంది, 12వ తేదీ తర్వాత వస్తారు" అనే సమాధానం రావడంతో విద్యార్థులు, గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్య బోధనే ప్రాధాన్యమా? లేక అధికారుల వ్యక్తిగత పనులే ముఖ్యమా? అని ప్రశ్నించారు. గ్రామస్థులు మాట్లాడుతూ, ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ విధులకు గైర్హాజరవడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ఒక్క విద్యార్థి ఉన్నా పాఠశాల నడపాలని ప్రభుత్వం చెప్పే సమయంలో, వందలాది మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో బోధన లేకపోవడం విచారకరమని అభిప్రాయపడ్డారు. వెంటనే తాత్కాలికంగా మరో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిని నియమించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# వర్ధన్నపేటలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమం

-8వ విడత టీకా కార్యక్రమం ప్రారంభం.
-ప్రతి రైతు టీకాలు పశువులకి వేయించాలి.
-జిల్లా పశు వైద్యాధికారి మజ్జి బాలకృష్ణ పిలుపు.

**మార్చి 10 జైభీమ్ ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)**

తెలంగాణ రాష్ట్రంలో పశువుల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎనిమిదవ విడత ఉచిత గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎమ్‌డీ) టీకా కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఫిరంగి గడ్డలో మంగళవారం పశువులకు ఉచిత టీకాలు అందించారు. జిల్లా పశు వైద్యాధికారి మజ్జి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి, మేకలు-- గొర్రెలలో వచ్చే పి.పి.ఆర్ వ్యాధి, పందుల్లో కనిపించే క్లాసికల్ స్వైన్ ఫీవర్, అలాగే గోసులక్స్ వంటి వ్యాధులను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉచిత టీకాలు అందిస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ టీకా కార్యక్రమం అమలు జరుగుతోందని అన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా నాలుగు నెలలు దాటిన దూడలకు టీకాలు వేయించాల్సిన అవసరం ఉందన్నారు. పాలిచ్చే పశువులకు లేదా సూడుతో ఉన్న పశువులకు టీకాలు వేయకూడదనే అపోహలు పూర్తిగా మూఢనమ్మకాలు మాత్రమేనని స్పష్టం చేశారు. టీకాలు వేయించకపోతే పశువులకు తీవ్రమైన నష్టాలు కలిగే అవకాశముందని హెచ్చరించారు.మన దేశీయ జాతి పశువులు వ్యాధులను తట్టుకునే సామర్థ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవడం అవసరమని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్యం రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని తెలిపారు.ఈ సందర్భంగా ఇలాంటి కార్యక్రమం నిర్వహించేందుకు సహకరించిన మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణికి జిల్లా పశు వైద్యాధికారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, 12వ డివిజన్ కౌన్సిలర్ తిరుపెల్లి వాణి, ఏ.డి.ఇ.ఎం వెంకటేశ్వర్లు, వెటర్నరీ డాక్టర్ రాజేందర్, రైతులు, పట్టణ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రత్యేక దళిత రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది: శివముని స్వామీజీ హెచ్చరిక



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవా ట్రస్ట్ నేతృత్వంలో మహదేవ్ పుర నియోజకవర్గంలోని మారతహళ్లిలోని మంజునాథ్ నగర్‌లో విద్యార్థుల ప్రతిభా పురస్కారం మరియు మహిళా దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించింది. బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, దీపం వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆది జాంభవ మఠానికి చెందిన శ్రీ శివ ముని స్వామీజీ మాట్లాడుతూ, అనేక మంది గొప్ప సాధకుల జయంతిని మన రాష్ట్రంలో ప్రభుత్వం జరుపుకుంటుందని అన్నారు. మన సమాజానికి చెందిన ఆది జాంభవ యుగయుగాలుగా అమరుడని, ఆయన జయంతిని జరుపుకోవాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. నగరాల్లో ఒక రకమైన అంటరానితనం ఉంది, గ్రామాల్లో ఒక రకమైన అంటరానితనం ఉంది. ముఖ్యంగా, కుల వ్యవస్థ మఠాలు, దేవాలయాలు, మందిరాలు మరియు గోపురాలలో పుడుతుంది. దళితులను మఠాలు, మందిరాలు మరియు గోపురాలలో ట్రస్టీలుగా నియమించాలి. ప్రధానమంత్రి దీనిని ప్రకటించాలి. మన దళితులు కూడా ముఖ్యమంత్రి పదవి కోరుకుంటున్నారని చెప్పే వారికి ఓటు వేయండి. ఆ మూడు పార్టీలు ( కాంగ్రెస్, బిజెపి, జెడిఎస్ ) శుద్ధ దొంగలు. ఈ విధంగా దళితులకు అన్యాయం చేస్తూనే ఉంటే భవిష్యత్తులో దళిత ప్రత్యేక రాష్ట్రాన్ని నిర్మించాల్సి ఉంటుంది. కళా రంగాలలో దళితులు ఎదగడానికి అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కళకు మూలం మన దళితులే. అన్ని రంగాల మాదిరిగానే కళా రంగంలో కూడా కుల వివక్ష పెరిగింది. ఇంట్లో, "దయచేసి చనిపోయిన ఇంటి దేవుడిని పూజించండి" అని చెప్పి ఆయన అన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు కృష్ణమూర్తి మాదిగ మాట్లాడుతూ, మా ఆల్ కర్ణాటక డాక్టర్ బాబు జంజీవన్ రామ్ సేవా ట్రస్ట్ ప్రతి సంవత్సరం ప్రతిభా పురస్కారం మరియు మహిళా దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, వివిధ రంగాలలో సాధించిన పిల్లలను ప్రతిభావంతులైన విద్యార్థులకు పుస్తకాలు మరియు ప్రోత్సాహక డబ్బు, వికలాంగులకు వీల్‌చైర్లు ఇవ్వడం ద్వారా ప్రోత్సహించి సత్కరిస్తామని, వారిని సన్మానించి సత్కరిస్తామని అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా మహిళలకు చీరలు ఇచ్చి సత్కరించారు. రాబోయే రోజుల్లో, బాబా సాహెబ్ అంబేద్కర్ మరియు బాబు జగ్జీవన్ రామ్ ఆశీస్సులతో మేము ఇలాంటి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తాము అని చెప్పారు. ఈ సందర్భంలో గౌరవ అధ్యక్షుడు మాదేష్, ప్రధాన కార్యదర్శి మాదేష్ బిఆర్, గోపాల్, సీనియర్ దళిత నాయకులు చిక్కమునియప్ప, ఆర్. లోకేష్, హూడి రామచంద్ర చిన్ని, అమర్‌నాథ్, శ్రీకాంత్ రావణ్, కోలార్ ఎంపీ అభ్యర్థి గౌతమ్, మునిమారప్ప, మునిరాజ్, శోభా రమేష్, విమల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'

208 మంది అరెస్ట్!
తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో పోలీసుల మెరుపు దాడులు
రాష్ట్రవ్యాప్తంగా 208 మందిని అరెస్ట్ చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో
నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, విద్యార్థులు
సుమారు రూ.100 కోట్ల విలువైన మోసాలకు మ్యూల్ ఖాతాలు వాడినట్లు గుర్తింపు
కమీషన్ కోసం తమ ఖాతాలను సైబర్ మోసగాళ్లకు అప్పగించినట్లు వెల్లడి





**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో సైబర్ మోసగాళ్లకు సహకరిస్తున్న వారిపై రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో ఫిబ్రవరి 25న ప్రారంభించిన ఈ రాష్ట్రవ్యాప్త ఆపరేషన్‌లో భాగంగా 208 మందిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం తెలిపారు. నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఏడుగురు విద్యార్థులు, 15 మంది మహిళలు, ఇద్దరు లెక్చరర్లు, విద్యుత్ శాఖ ఉద్యోగి కూడా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాలకు సంబంధించిన నగదు బదిలీలకు ఉపయోగించే 'మ్యూల్ ఖాతాల'పై ఈ ఆపరేషన్ కేంద్రీకరించింది. నిందితులు 5 శాతం వరకు కమీషన్ తీసుకుని తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటాను విశ్లేషించిన టీజీసీఎస్‌బీ, తెలంగాణలో తెరిచిన అనుమానాస్పద ఖాతాలను గుర్తించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా 512 మంది సిబ్బందితో కూడిన 137 పోలీస్ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా 137 బ్యాంకు బ్రాంచ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా 9,451 కేసులతో సంబంధం ఉన్న 1,888 మ్యూల్ ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా సుమారు రూ.100 కోట్ల మోసం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అరెస్టయిన వారిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జూబ్లీహిల్స్ మర్చంట్ కో-ఆపరేటివ్ బ్యాంకులకు చెందిన ఇద్దరు ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరు సరైన కేవైసీ నిబంధనలు పాటించకుండా ఖాతాలు తెరిచేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 63 మొబైల్ ఫోన్లు, 208 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్ బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌లో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల ఖాతాలను కూడా మోసాలకు వాడినట్లు తేలింది. కొందరు నిందితులు నకిలీ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఖాతాలు తెరిచి మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు వర్ధన్నపేటలో భారీ అవగాహన ర్యాలీ

"పిల్లల భద్రత -- డ్రగ్స్‌కు అడ్డుకట్ట" లక్ష్యంతో విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమం.
సింథటిక్ డ్రగ్స్ మత్తు పదార్థాలపై వివరణ.
డ్రగ్స్ ప్రమాదాలపై ఏసీపీ అంబటి నరసయ్య కీలక సూచనలు

**మార్చి 10 జైభీమ్ ప్రతినిధి:(వరంగల్ /వర్ధన్నపేట)**

తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పిల్లల భద్రత -- డ్రగ్స్‌కు అడ్డుకట్ట" కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలో మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య ఆధ్వర్యంలో, మున్సిపల్ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ, విద్యార్థులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. విద్యార్థులు మాదకద్రవ్యాల నిర్మూలనపై నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో "మాదకద్రవ్యాల నిర్మూలన -- పిల్లల భద్రత, మత్తు పదార్థాలకు అడ్డుకట్ట" అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ అంబటి నరసయ్య మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చిన్న వయసులోనే మంచి అలవాట్లు అలవరుచుకుంటే భవిష్యత్తు బలంగా ఉంటుందని అన్నారు. మొదట్లో మత్తు పదార్థాలు ఆనందాన్ని ఇస్తాయని భావించినా, కాలక్రమంలో అవి శారీరకంగా, మానసికంగా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయని వివరించారు.డ్రగ్స్ వల్ల నరాలు క్షీణించడం, గుండె, కాలేయం, జీర్ణాశయం వంటి ముఖ్య అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు తమ మనసుపై నియంత్రణ కోల్పోతారని పేర్కొన్నారు. డ్రగ్స్ రెండు రకాలుగా ఉంటాయని, అందులో సింథటిక్ డ్రగ్స్ మరియు గంజాయి మొక్కల ద్వారా లభించే మత్తు పదార్థాలు ఉన్నాయని తెలిపారు.విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ భూములకు వెళ్లినప్పుడు గంజాయి మొక్కలను గుర్తించి వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మాదకద్రవ్యాల రవాణా లేదా విక్రయాలపై అనుమానం వచ్చినప్పుడు వెంటనే 1808 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ నంబర్‌కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని, ఈనాటి విద్యార్థులే రేపటి సమాజానికి ఆదర్శ పౌరులుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య, మెడికల్ ఆఫీసర్లు, ఎంఆర్‌వో విజయసాగర్, ఎంపీడీవో వెంకటరమణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ శ్రీధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్‌పర్సన్ శిభారాణి, ఎస్‌ఐలు సాయిబాబు, రాజు, కౌన్సిలర్లు, రెవెన్యూ, వైద్య, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి





టీఎస్ యుటిఎఫ్ నేత దూపటి కిరణ్ కుమార్ డిమాండ్

**హన్మకొండ, 10 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హసన్ పర్తి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ), యూఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు దూపటి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు దశల పోరాటాల్లో భాగంగా, హనుమకొండ జిల్లా హసన్పర్తి కేజీబీవీ పాఠశాలలో మరియు మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్ఎస్ మరియు సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, 29 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని, మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయడంతో పాటు నైట్ డ్యూటీల నుంచి మినహాయింపు కల్పించి కేర్ టేకర్లను నియమించాలని కూడా డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోరాటాల్లో సిబ్బంది, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ జి. భాస్కరరావు, మండల అధ్యక్షులు రమాదేవి, ప్రధాన కార్యదర్శి టి. నరేష్, మండల కార్యదర్శి కే. వెంకట రమణారెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి స్వప్న, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉద్యోగి ఆత్మహత్యాయత్నం ప్రచారం అవాస్తవం

**స్పష్టం చేసిన ఏపీ ప్రభుత్వం**
**ఉద్యోగి ఆత్మహత్యాయత్నంపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారం**
**ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసిన ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం**
**తాను క్షేమంగా ఉన్నానంటూ వీడియో సందేశం విడుదల చేసిన ఉద్యోగి అవినాశ్ సింగ్**
**అంతర్రాష్ట్ర బదిలీల ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందంటూ ప్రభుత్వం వెల్లడి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణకు బదిలీ కావడం లేదన్న ఆవేదనతో ఏపీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఏపీ ప్రభుత్వం స్పందించింది. ఇది పూర్తిగా నిరాధారమైన, అసత్య ప్రచారమని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఇవాళ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఉద్యోగులు, ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే ఇలాంటి వార్తలను వ్యాప్తి చేస్తున్నారని పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. ఏపీ సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న అవినాశ్ సింగ్, తెలంగాణకు బదిలీ కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించారని 'ఖీవవమ(ఏ ౦వత్రీబస్త్రబ టవవసంఓవ)' అనే సోషల్ మీడియా ఖాతాలో పోస్టులు వైరల్ అయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉందని కూడా అందులో పేర్కొన్నారు. ఈ వైరల్ కథనాలపై స్పందించిన ఏపీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండించింది. తాను ఎలాంటి ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని, క్షేమంగా ఉన్నానని అవినాశ్ సింగ్ స్వయంగా ఒక వీడియో సందేశం ద్వారా తెలియజేశారని స్పష్టం చేసింది. దీంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి అడ్డుకట్ట వేసింది. వాస్తవానికి ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీల ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందని ప్రభుత్వం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. సమాచార శాఖ కమిషనర్ ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన జారీ చేసిన ఉత్తర ప్రత్యుత్తరాల ప్రకారం, తెలంగాణకు బదిలీ కోరుకుంటున్న ఉద్యోగుల జాబితాలో 472వ క్రమసంఖ్యలో అవినాశ్ సింగ్ పేరు ఉందని ఫ్యాక్ట్‌చెక్ విభాగం వివరించింది. ఉద్యోగులకు సంబంధించిన డేటాను అప్‌డేట్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం తెలంగాణ ప్రభుత్వానికి పంపినట్లు కూడా తెలిపింది. బదిలీల ప్రక్రియ సజావుగా సాగుతున్న తరుణంలో ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మవద్దని ప్రజలకు, ఉద్యోగులకు ప్రభుత్వం సూచించింది.




# పదేళ్ల క్రితమే లొంగిపోతే ప్రాణ నష్టం తగ్గేది

**మాజీ మావోయిస్టు నేత ఆశన్న కీలక వ్యాఖ్యలు**
**ప్రజల కోసమే తమ ప్రస్థానమన్న ఆశన్న**
**మాజీ మావోయిస్టులు, అమరుల కుటుంబాలతో భేటీ**
**అడవిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటమే లక్ష్యమని స్పష్టీకరణ**
**ఆదివాసీల హక్కుల కోసం 30 ఏళ్లు పోరాడానన్న నేత**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు వాసుదేవరావు అలియాస్ ఆశన్న కీలక వ్యాఖ్యలు చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం భట్టుపల్లిలో సోమవారం ఆయన మాజీ మావోయిస్టులు, అమరుల కుటుంబాలతో సమావేశమయ్యారు. గతంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవని, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో తమ వంతు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తాము ఏ ఒక్క వర్గానికో పరిమితం కాకుండా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని ఆశన్న తెలిపారు. తమ వెంట ఉన్న వారితో పాటు, ఇంకా అడవిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నిస్తామన్నారు. "మేము మావోయిస్టు పార్టీ బలంగా ఉన్నప్పుడే, అంటే పదేళ్ల క్రితమే ఈ లొంగుబాటు నిర్ణయం తీసుకుని ఉంటే ఇంత మంది ప్రాణాలు పోయేవి కావు" అని ఆయన అభిప్రాయపడ్డారు. దండకారణ్యంలో 30 ఏళ్ల పాటు ఆదివాసీల హక్కుల కోసం, నిర్బంధాల మధ్య ప్రశ్నించే గొంతుకగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. తన ఉద్యమ ప్రస్థానం మొదలైన భట్టుపల్లితో తనకు విడదీయని అనుబంధం ఉందని ఆశన్న పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట శ్యాందాదా, రాజ్మన్, పద్మ తదితర మాజీ నేతలు ఉన్నారు. మాజీ అగ్రనేతలు అమరుల కుటుంబాలను కలవడం, వారితో చర్చలు జరపడాన్ని పోలీసు నిఘా వర్గాలు అత్యంత నిశితంగా గమనించాయి.

# ఖమ్మంలో హైడ్రామా.. కల్వకుంట్ల కవిత అరెస్ట్!

**వెలుగుమట్ల బాధితుల కోసం కవిత దీక్ష**
**తెల్లవారుజామున చుట్టుముట్టిన 600 మంది పోలీసులు**
**అరెస్ట్ చేసినా దీక్ష ఆపబోనన్న కవిత**
**బాధితులకు అక్కడే ఇళ్లు ఇవ్వాలని డిమాండ్**
**కవితతో పాటు కస్టడీలోకి విశారదన్ మహరాజ్**



**ఖమ్మం, జై భీమ్ న్యూస్**

ఖమ్మం నగరంలో వెలుగుమట్ల భూదాన్ భూమి బాధితుల తరఫున పోరాడుతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితులకు మద్దతుగా ఖమ్మం అంబేద్కర్ భవన్‌లో ఆమె చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున భగ్నం చేశారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ విశారదన్ మహరాజ్‌ను కూడా పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. నేటి ఉదయం 6 గంటల సమయంలో ఖమ్మం సీపీ ఆధ్వర్యంలో సుమారు 600 మంది పోలీసులు ఒక్కసారిగా దీక్షా శిబిరాన్ని చుట్టుముట్టారు. నాయకులందరినీ బలవంతంగా వాహనాల్లో ఎక్కించి హైదరాబాద్‌కు తరలించారు. ఏళ్ల తరబడి నివసిస్తున్న పేదలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం దుర్మార్గమని ఈ సందర్భంగా కవిత మండిపడ్డారు. పోలీసు కస్టడీలో ఉన్నప్పటికీ తన నిరాహార దీక్ష కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగివచ్చి, కూల్చివేతలు జరిగిన చోటే బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

# హైదరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్..

**శంషాబాద్ వద్ద మెట్రోతో అనుసంధానం!**
**హైదరాబాద్ కేంద్రంగా మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్ల ప్రతిపాదన**
**శంషాబాద్ వద్ద హైస్పీడ్ రైల్ టెర్మినల్‌కు మెట్రో రైలు అనుసంధానం**
**విమానాశ్రయం, ఓఆర్ఆర్, మెట్రో, బుల్లెట్ రైలు ఒకేచోట కలిసేలా మెగా జంక్షన్**
**ప్రాజెక్టుపై క్షేత్రస్థాయి అధ్యయనానికి అధికారులకు ప్రభుత్వ ఆదేశాలు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాజధాని నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు రంగం సిద్ధమవుతోంది. నగర శివారులోని శంషాబాద్ కేంద్రంగా ఏర్పాటు కానున్న హైస్పీడ్ రైల్ (బుల్లెట్ ట్రైన్) నెట్‌వర్క్‌ను మెట్రో రైలుతో అనుసంధానించే బృహత్ ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మెగా ప్రాజెక్టుపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. కేంద్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణె నగరాలకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. గంటకు 300 నుంచి 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైళ్ల కోసం శంషాబాద్ విమానాశ్రయానికి దగ్గరలో ఉన్న బహదూర్‌గూడ, రషీద్‌గూడ ప్రాంతాల్లో భారీ టెర్మినల్ నిర్మించనున్నారు. ఇందుకోసం అవసరమైన సుమారు 500 ఎకరాల భూమిని సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుముఖత చూపింది. మరోవైపు, మెట్రో రెండో దశలో భాగంగా నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి, అక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు కొత్త లైన్లు నిర్మిస్తున్నారు. ఈ మెట్రో మార్గాలను నేరుగా ప్రతిపాదిత హైస్పీడ్ రైల్ టెర్మినల్‌తో కలపాలని ప్రభుత్వం యోచిస్తోంది. తద్వారా శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు, మెట్రో రైలు, బుల్లెట్ ట్రైన్ అనే నాలుగు ప్రధాన రవాణా వ్యవస్థలు ఒకేచోట కలిసేలా ఒక మెగా జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రణాళిక కార్యరూపం దాల్చితే ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి సమగ్ర నివేదిక వెలువడనుంది.

# తెలుగు వర్సిటీల మధ్య వివాదం

**ఏపీ వీసీకి తెలంగాణ లీగల్ నోటీసులు**
**ఏపీ తెలుగు వర్సిటీకి తెలంగాణ వర్సిటీ లీగల్ నోటీసు**
**సంగీత, నృత్య కళాశాలల పరీక్షల నోటిఫికేషన్‌పై అభ్యంతరం**
**విభజన పూర్తవనందున కాలేజీలు తమ పరిధిలోనే ఉన్నాయని తెలంగాణ వాదన**
**ప్రభుత్వం తరఫున సమాధానమిస్తామన్న ఏపీ వర్సిటీ వీసీ**
**ఇటీవలే తెలంగాణ వర్సిటీ పేరును 'సురవరం ప్రతాపరెడ్డి'గా మార్చిన వైనం**




**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మరో వివాదం తెరపైకి వచ్చింది. రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం గడిచినా ఆస్తుల పంపకాలు ఇంకా పూర్తికాని నేపథ్యంలో రెండు రాష్ట్రాల తెలుగు విశ్వవిద్యాలయాల మధ్య న్యాయపోరాటం మొదలైంది. ఏపీలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం లీగల్ నోటీసులు జారీ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు, పాఠశాలల్లో ప్రవేశ పరీక్షల నిర్వహణకు ఏపీ వర్సిటీ నోటిఫికేషన్ ఇవ్వడమే ఈ వివాదానికి మూలకారణం. విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులు వసూలు చేయడాన్ని తెలంగాణ వర్సిటీ తీవ్రంగా తప్పుబట్టింది. రాష్ట్ర విభజన ప్రక్రియ ఇంకా పూర్తిగా కొలిక్కి రానందున విజయనగరం, గుంటూరు, నెల్లూరు, రాజమహేంద్రవరం, విజయవాడ, కర్నూలులోని ఈ కళాశాలలు, పాఠశాలలు చట్టపరంగా తమ పరిధిలోనే ఉన్నాయని తెలంగాణ వర్సిటీ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో తమ పరిధిలోని సంస్థలకు పరీక్షలు నిర్వహించే అధికారం ఏపీ వర్సిటీకి లేదంటూ వీసీకి లీగల్ నోటీసులు పంపింది. ఈ వివాదంపై ఏపీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మునిరత్నం నాయుడు స్పందించారు. తెలంగాణ వర్సిటీ నుంచి లీగల్ నోటీసులు అందిన మాట వాస్తవమేనని, దీనిపై ప్రభుత్వం తరఫున తగిన సమాధానం ఇస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తవడంతో తెలంగాణ వర్సిటీ ఏపీలో ప్రవేశాలు నిలిపివేసింది. దీంతో ఏపీ ప్రభుత్వం ఇక్కడ కొత్తగా తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, వీసీని నియమించింది. కాగా, తెలంగాణ అస్తిత్వం, సంస్కృతిని ప్రతిబింబించేలా, అక్కడి తెలుగు విశ్వవిద్యాలయానికి 2024 జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం 'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం'గా పేరు మార్చిన విషయం తెలిసిందే. తెలంగాణ వైతాళికుడు, సామాజిక సంస్కర్త, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడైన సురవరం ప్రతాపరెడ్డికి గౌరవ సూచకంగా ఈ మార్పు చేశారు. ప్రస్తుతం ఈ రెండు వర్సిటీల మధ్య నెలకొన్న న్యాయపోరాటం ఎలాంటి మలుపు తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఏపీ ప్రజలు ఆందోళన చెందొద్దు

**మన వద్ద గ్యాస్ కొరత లేదు: మంత్రి నాదెండ్ల మనోహర్**
**భారత్ పై పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం**
**రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదన్న మంత్రి నాదెండ్ల**
**బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని అధికారులకు ఆదేశం**
**కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలని హెచ్చరిక**
**గృహ అవసరాలకే తొలి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టీకరణ**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గృహ, వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన భరోసా ఇచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో, రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై మంత్రి మంగళవారం ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కీలక సమయంలో గ్యాస్‌ను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా జిల్లా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించడం, ఇష్టానుసారం ధరలు పెంచడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడటమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని మంత్రి తెలిపారు. అవసరమైతే, వాణిజ్య అవసరాలకు ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేస్తామన్నారు. రోజువారీ నిల్వల్లో ఏమాత్రం తేడా వచ్చినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, సరఫరా వ్యవస్థను పూర్తి అప్రమత్తంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

# పాలనపై సీఎం చంద్రబాబు ఫోకస్...

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలును వేగవంతం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమావేశానికి సిద్ధమయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి సమీక్షలు జరిపి, పరిపాలన యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలోని ఐదో బ్లాకులో జరిగే ఈ సదస్సు మొదటి రోజు ఉదయం 10 గంటలకు సీసీఎల్ఏ స్వాగత ప్రసంగంతో మొదలవుతుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాల అనంతరం ఉదయం 10:30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం "స్వర్ణాంధ్ర ఏ2047" విజన్‌లో భాగంగా నిర్దేశించుకున్న పది సూత్రాల అమలుపై చర్చిస్తారు. పేదరిక నిర్మూలన, జల భద్రత, వ్యవసాయంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై సమీక్షిస్తారు. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు, జిల్లాల వారీగా సాధించిన ప్రగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా ఈ-ఆఫీస్ ఫైళ్ల సత్వర పరిష్కారం, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేస్తారు. రెండో రోజు సమావేశంలో ప్రజారోగ్యం, సంక్షేమ పథకాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన "సూపర్ సిక్స్" పథకాల అమలు తీరును సమీక్షిస్తారు. వీటితో పాటు మధ్యాహ్న భోజన పథకం, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తారు. భూ పరిపాలన, రెవెన్యూ రాబడుల పెంపు, విద్య, ఉపాధి కల్పన వంటి అంశాలపైనా సమీక్షలు ఉంటాయి. సదస్సులో భాగంగా రెండో రోజు సాయంత్రం జరిగే సమావేశం అత్యంత కీలకం కానుంది. రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితిపై ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. ఈ సెషన్‌కు జిల్లా కలెక్టర్లతో పాటు ఎస్పీలు కూడా హాజరుకానున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల ప్రస్తుత పరిస్థితిపై డీజీపీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. మొత్తంగా ఈ రెండు రోజుల సమావేశాల ద్వారా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ లక్ష్యాలపై అధికార యంత్రాంగానికి పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem



# ‘రామాయణం’ నుంచి రణబీర్, సాయి పల్లవి ఫొటోలు లీక్.. అసలు నిజం ఇదే!

**రామాయణం షూటింగ్ ఫొటోలంటూ కొన్ని స్టిల్స్ వైరల్**
**అవి నకిలీవని స్పష్టం చేసిన చిత్ర యూనిట్**
**ఏఐ టెక్నాలజీతో సృష్టించిన ఫేస్-స్వాప్ చిత్రాలని వెల్లడి**
**రాముడిగా రణబీర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్**
**ఈ ఏడాది దీపావళికి తొలి భాగం విడుదలయ్యే అవకాశం**

బాలీవుడ్ ప్రతిష్ఠాత్మక చిత్రం ‘రామాయణం’కు సంబంధించి సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఉన్న ఈ ఫొటోలు సినిమా సెట్స్ నుంచి లీక్ అయ్యాయని ప్రచారం జరిగింది. అయితే, ఈ ప్రచారంపై చిత్రబృందం స్పందించి, అవన్నీ నకిలీవని స్పష్టం చేసింది. ప్రస్తుతం వైరల్ అవుతున్న చిత్రాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో సృష్టించిన ఫేస్-స్వాప్ చిత్రాలని చిత్రబృందం తెలిపింది. 2015లో వచ్చిన ‘సియా కే రామ్’ అనే టీవీ సీరియల్‌లోని స్టిల్స్‌ను ఉపయోగించి, అందులోని నటీనటుల ముఖాల స్థానంలో రణబీర్, సాయి పల్లవి ముఖాలను ఆకతాయిలు మార్ఫింగ్ చేసినట్లు వివరించింది. ఈ ఫొటోలకు, తమ సినిమాకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్టులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. ఇక రావణుడి పాత్రలో కేజీఎఫ్ ఫేమ్ యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్ కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక పోస్టర్లను విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ పేర్కొంది.

# డాడీ, ఇంతకంటే ఏం కావాలి?...

**తండ్రి చిరంజీవిపై సుస్మిత ఎమోషనల్ పోస్ట్**
**తండ్రి మెగాస్టార్ చిరంజీవిపై ప్రేమను చాటుకున్న సుస్మిత కొణిదెల**
**సోషల్ మీడియాలో భావోద్వేగపూరిత పోస్ట్ షేర్ చేసిన మెగా డాటర్**
**బర్త్ డే విషెస్ తెలిపిన తండ్రి చిరంజీవికి కృతజ్ఞతలు తెలుపుతూ పోస్ట్**
**రెండేళ్ల వయసు నుంచి నిర్మాతగా మారిన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్న సుస్మిత**
**నాన్న, గురువు, హీరో, మెగాస్టార్ అన్నీ ఒకే వ్యక్తిలో ఉన్నాయంటూ వ్యాఖ్య**



మెగాస్టార్ చిరంజీవి పెద్ద కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెల తన తండ్రిపై ఉన్న ప్రేమను, అభిమానాన్ని చాటుకుంటూ సోషల్ మీడియాలో ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. చిరంజీవి తెలిపిన పుట్టినరోజు శుభాకాంక్షలకు బదులిస్తూ ఆమె పంచుకున్న ఈ సందేశం అభిమానుల హృదయాలను హత్తుకుంటోంది. “డాడీ, థ్యాంక్యూ. రెండేళ్ల పాపగా మీ చేయి పట్టుకుని సెట్స్‌లోకి అడుగుపెట్టిన నేను, ఇప్పుడు మీ నిర్మాతగా మారడం వరకు నా జీవితం ఓ అద్భుతమైన వరం. నాకు ఒకే వ్యక్తిలో తండ్రి, గురువు, నిజ జీవిత హీరో, మెగాస్టార్.. అన్నీ మీరే. ఇంతకంటే నేనేం కోరుకోగలను? మీ విషెస్‌కి థ్యాంక్యూ. ఎప్పుడూ మీలాగే ఉన్నందుకు ధన్యవాదాలు. లవ్ యూ ఆల్వేస్” అంటూ సుస్మిత తన పోస్టులో పేర్కొన్నారు. చిన్నప్పుడు తండ్రి వేలు పట్టుకుని సినిమా సెట్లకు వెళ్లిన జ్ఞాపకాల నుంచి, ఇప్పుడు ఆయన చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించే స్థాయికి ఎదగడం తన అదృష్టమని ఆమె అభిప్రాయపడ్డారు. కాస్ట్యూమ్ డిజైనర్‌గా కెరీర్ ప్రారంభించిన సుస్మిత, తన భర్తతో కలిసి గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై చిత్రాలను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. తండ్రిపై సుస్మిత చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




# పవన్ కల్యాణ్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సెన్సార్ పూర్తి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమా విడుదలకు రంగం సిద్ధమైంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్ సీ) ఈ సినిమాకు యు/ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ ఓ కొత్త పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా రన్ టైమ్ 2 గంటల 29 నిమిషాలుగా ఖరారైంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. వాస్తవానికి ఈ సినిమాను మార్చి 26న విడుదల చేయాలని మొదట భావించారు. అయితే, అదే తేదీకి రావాల్సిన ‘టాక్సిక్’ అనే మరో సినిమా వాయిదా పడటంతో, ఆ స్లాట్‌ను ‘ఉస్తాద్ భగత్ సింగ్’ దక్కించుకుంది. దీంతో ఉగాది పండుగను పురస్కరించుకుని మార్చి 19నే ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఇదే రోజున రణ్‌వీర్ సింగ్ నటించిన ‘ధురంధర్ 2’ కూడా విడుదల కానుండటంతో బాక్సాఫీస్ వద్ద పోటీ నెలకొంది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ పాటలు స్వరపరచగా, తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. సెన్సార్ పనులు కూడా పూర్తి కావడంతో, ప్రమోషన్ల వేగాన్ని పెంచి, ప్రకటించిన తేదీకి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.